# పదునొకండవ ప్రసంగము

తరువాతిరోజున ఉదయము టీ, పాలు మొదలగునవి వచ్చెను. శ్రీనిత్యానందస్వామివారును, శ్రీప్రకాశానందస్వామివారును, ఇంకను ఇతరులును చాలమంది కూర్చొని ఉండిరి. డా. వీరజీభాయి ప్రశ్నించెను.

"రాత్రిప్రసంగమున కర్మ, ఉపాసన, జ్ఞానము– వీని వివేచనము జరిగెను. కాని ఈరోజులలో కర్మ, ఉపాసన ఎవరును చేయరు. ఒకవేళ చేసినను, అట్టివారు ఏకొద్దిమందియో కలరు. కాని వారియందు అంతఃకరణపారిశుద్ధ్యము కానరాదు. వైభవలాలసులగుదురు. కారణమేమి?"

## దంభయుక్తమగు కర్మము నిష్ఫలము,

స్వా. ప్ర.:– కొందరు ఎక్కువ నియమముతో సంధ్య, దేవతార్చన మొదలగునవి చేయుదురు. నిష్కామకర్మముచే చిత్తశుద్ధి కలుగును. సకామకర్మముచే స్వర్గాదులు లభించును. కాని దంభముతో చేసినవారికి చిత్తశుద్ధియును కలుగదు; స్వర్గాదులును లభించవు. ఈదంభము ఈనాడు ఎక్కువగనే ఉన్నది. బ్రాహ్మణులు,సంధ్యావందనము చేయకపోయినచో లోకులు గౌరవించరనియే సంధ్యావందనము చేయుచున్నారు. ఇటులనే వైష్ణవులు స్వామివారి కైంకర్యము చేయకపోయినచో నాస్తికుల మనబడుదుము అను భావముతోనే దేవదర్శనాదులు చేయుచున్నారు. సన్న్యాసులు ప్రపంచమున పూజించబడుచున్నారు. గౌరవము పొందుచున్నారు. ఆ పూజాగౌరవములకొరకే వారు ఎక్కువ డాంబికమును చేయుచున్నారు. తాను కలుపులు మూసికొని లోపల నిద్రపోవుచున్నను, ఎవరైన వచ్చి

అడిగినచో శిష్యులు స్వామివారు ధ్యానమునందు ఉన్నారు; సమాధి యందు ఉన్నారు అని డాంబికములు పలుకుదురు.

## డాంబికుల లక్షణము,

డాంబికుల లక్షణమును శ్రీశంకరులు ఇట్లు చెప్పిరి:-

*ధ్యానపూజాదికం లోకే ద్రష్టర్యేవ కరోతి యః ।*
*పారమార్థికధీహీనః దమ్భాచారః స ఉచ్యతే ॥*

“పరమార్థబుద్ధిరహితుడయి ధ్యాన, పూజాదులు ప్రజలు చూచుటకు మాత్రమే చేయువాడు దాంభికుడు అని చెప్పబడును.”

ఈవిషయమున తుకారాము తన అభంగమున ఇట్లనెను:—

“భక్తికి సంబంధించిన బాహ్యచిహ్నములు ధరించి భక్తులమని చెప్పుకొనుటకు తిప్పలుపడువారు సర్వవిధముల వ్యభిచారులు. భగవానునకు తన జీవభావము సమర్పించుట భక్తికి అన్నిటికంటెను ముఖ్యమైన తత్త్వము. ఈకపటభక్తులు విషయేచ్ఛాపరులయి, దీనులయి, ద్రవ్యోపార్జనకు ఏ ఏ పనులు చేసినను అవి అన్నియు ప్రపంచ భారమును పెంచునవియే. వారి అంతఃకరణమున భగవానునియందు శ్రద్ధ ఉండదు. అశ్రద్ధ నాస్తికత్వముయొక్క ప్రధానలక్షణము. సమస్తవిశ్వమును పాలించువానియందు అచలమగు శ్రద్ధను కలిగియుండి వానిచరణములను విడువక శరణుజొచ్చుటయే సారపదార్థము. ఇట్లు చేయనివాడు మరి ఏమి చేసినను వ్యర్థము.”

శునకము మలభక్షణమునందు మోజు కలిగియుండును. దానికి ఎవరైన పిండివంటలు ఉత్తమమయినవి రుచికలవి అని ఇచ్చిన అది సంతోషించునా? అటులనే భక్తిహీనునకు ఆడంబరములే నచ్చును. అతనికి ప్రాపంచికపదార్థములే ఇష్టము. వీరికి పారమార్థిక విషయములయందు ప్రేమ కలుగదు. కుక్కఎదుట పంచామృతపాత్ర నుంచినను దాని దృష్టి ఎముకముక్కవైపునకే మరలును. పాముకు పాలు త్రాగించినను దానినోటినుండి విషమే బయటపడును కదా!

"సాధువులు ధరించు వేషమును నేను దూషించను. కాని దానిలోపల ఇల్లు కట్టుకొని కాపురమున్న అవగుణములను దూషించు చున్నాను. సజ్జనులారా! నేను చెప్పినది వినుడు. నాపై కోపపడకండి. అన్నముచే అన్ని ప్రాణులు జీవించును అని అందరు ఎరుగుదురు కదా! కాని ఆ అన్నములో ఒక విషబిందువు పడినను అన్నము అంతయు విషమయి జనుల ప్రాణములను తీసివేయును. బంగారము అందమైనదియును, పరిశుద్ధమైనదియును అని అందరును ఎరుగుదురు. కాని దానితో మరియొక తేలికలోహము కలసినచో మొత్తము బంగారము అంతయు తేలికబంగారముగా లెక్క కట్టబడును. అటులనే ఏవస్తువైనను మొదట గొప్పదియును, మంచిదియును అయినను దానియందు ఏవైన చెడులక్షణములు కన్పించినచో ఆ లక్షణములచే దాని ఔన్నత్యము కప్పబడును. దాని ప్రాకృతిక ఔన్నత్యము వ్యర్థమగును. రణక్షేత్రమున శత్రువుపై దండెత్తి వెడలువాడు గొప్పవాడనియు, వీరుడనియు చెప్పబడును. అతనిని జనులు సన్మానింతురు. కాని ఇతరులు సైనికదుస్తులు ధరించినను అవి గాడిదబరువుతప్ప మరియొక ప్రయోజనము వారికి కలుగదు. భారమేకాని శోభస్కరము కాదు.

కొందరు గొప్పగొప్ప బ్రహ్మవేత్తలు "జీవుడు బ్రహ్మము" అని చెప్పుచు బాగుగా భక్ష్యభోజ్యములను అనుభవింతురు. ఆభోగములు తాము అనుభవించుట లేదనియు, నారాయణుడు అనుభవించుచున్నాడనియు వారు అనుకొనెదరు. వారేవిధముగను దేవునకు తీసిపోమనియు, దేవతాస్వరూపులమనియు, తమను ప్రతిపాదింతురు. కాని డబ్బుకొరకు కళ్ళు పెద్దవి చేసికొని చూచెదరు. త్యాగులు అగు మహాత్ములు ఎవరివద్దనుండి అయినను, వస్త్రము, పాత్రము మొదలగునవి తీసికొనినచో ఈబ్రహ్మజ్ఞానులు వారిని నిందించెదరు. అవి అన్నియు సగాయూజన్యపదార్థములు అనిచెదరు,

కాని వారు శాలువలు, వెండిచెంబులు, ధనము మొదలగునవి సంపా దించుటకు వెనుదీయరు.

ఇట్టి జ్ఞానులు కోట్లకొలది జన్మలు ఎత్తినను భగవానుని దర్శించలేరు. ధర్మముకొరకు దంభము కలిగియుండుట మహాపాపము. పారసభాగమున ఇట్లు చెప్పబడినది:— "దంభము అన నేమియో సరిగ ఆలోచించిన భగవద్భజనమునుండి విముఖుడగుటకు గుర్తు అని తెలియును. ప్రజలు తనను ధార్మికు డనుకొనవలె ననియు, ఉత్తము డనుకొనవలెననియు, తనను స్తవము చేయవలె ననియు దాంభికుడు అనుకొనును. ఇట్లు జనులు పూజలను పొందవలెనను ఇచ్ఛయే అతనిని దాంభికునిగా మార్చును." అందే దాంభిక లక్షణములు ఇట్లు చెప్పబడినవి:— "ఒంటరిగా నున్నప్పుడు సోమరిగా నుండును. ఇతరులు ఉన్నప్పుడు భజనచేయును. ప్రజలు తన మహిమను ఎక్కువగా గ్రహించవలెనని ఎక్కువ ఆడంబరము చేయును. ఈదాంభికులు తమను జనులు నిందించుచున్నారని తెలిసికొనినచో భజన మానివేయుదురు."

## దంభ భేదములు.

తాను పూజ్యుడనని తెలుపుకొనుటకు దంభమును కలిగియుండువారు 5 రకములు.

1. దేహదంభము:— శరీరమును విచిత్రముగాను, విలక్షణముగాను ప్రదర్శించుట లేక క్షీణింపజేయుట, కండ్లెర్రజేసి భయంకరముగా కన్పించుట, గాంభీర్యము వెలువడునట్లు నెమ్మదిగా, సాధువుగా మాట్లాడుట మొదలగునవి.

2. రంగువస్త్రములుకాని, చినిగిన పాతగుడ్డలుకాని, మృగచర్మముకాని ధరించుట.

3. భజనమునందు ఏకాగ్రతను చూపుటకు మౌనమును ధరించుట, భజనచేయుచున్నట్లు కన్పడుటకు పెదవులు కదల్చుట, శాస్త్ర

ములయందు చెప్పబడిన విధముగా తాను విద్వాంసుడనని తెలుపుటకు అనేకమంది శాస్త్రజ్ఞుల వాక్యములను కంఠస్థముచేసి మాట్లాడుచు తాను గొప్పసత్సంగివలె కన్పించుట.

4. ప్రజలు చూచునట్లు తలవంచినడచుట, ఎటును చూడకుండుట, మార్గమున గాంభీర్యమును ప్రకటించుచు నెమ్మదిగా నడచుట, ప్రజలు చూచునట్లు దానముచేయుట మొదలగునవి.

5. తన శిష్యులను వృద్ధిచేసికొనుటకు ప్రయత్నించుట, ఫలానా రాజు మాశిష్యుడని ప్రకటించుట.

## దంభమును పోగొట్టుకొనుటకు ఉపాయములు.

దంభమును పోగొట్టుకొనుటకు పట్టుదల, పురుషార్థము కావలెను. తానుచేయుచున్న పని ఎల్లరును చూచునట్లు చేయుస్వభావము బాల్యమునుండియు మనుష్యునియందు సామాన్యముగా కన్పించును. వయస్సు పెరిగినకొలదియు ఈభావము వృద్ధిపొందును. అనగా దంభము రోజురోజుకు ప్రబలును. ఎంతయో పట్టుదలతో, పురుషార్థముతో దానిని క్షీణింపచేయుటకు ప్రయత్నించవలెను. దంభమును పోగొట్టు అనేక ఉపాయములలో మొదటిది దానివలన కలుగు అనిష్టములను "దంభముచే పరలోకము నశించును" మొదలగు వాటిని తరచు ఆలోచించుట. దంభమునకు మూలకారణములు నాలుగు. 1. ప్రపంచము స్తుతించవలెనను కోరిక. 2. ప్రజలు నిందించెదరు అను భయము. 3. ప్రజలు పూజించవలెనను కోరిక. 4. ద్రవ్యోపార్జనము చేయవలెనను భావన.

1. ప్రపంచపు స్తవమునందు అబాధితనియమము కానరాదు. కరు ఎవనిని స్తుతించునో అతనినే మరియొకడు నిందించును. ఆవ్యక్తి కూడ ఎల్లప్పుడు స్తుతించుచునే ఉండును అను నియమము లేదు. ఈ సమయమున స్తుతించినవాడు కొంచెము సేపయినతరువాత స్తుతించక పోవచ్చును.

2. ప్రపంచమునందలి స్తుతికాని నిందకాని దేవుని సంతోష మునకు అసంతోషమునకు చిహ్నము కాదు. దంభాధిక్యము మాయ యందు ప్రేమచే కలుగును. వాసన దానిని పూరించును. కావున మనస్సునందు మాయాపూరితములగు సంకల్పములు కలిగినచో వాటిని తప్పించుటకు చాల సమయము వ్యర్థమగును. భజనయందు నిమగ్నుడగుటకు వీలు కలుగదు. అందుచే మాయాసంకల్పములు మనస్సున పుట్టగనే వానిని తీక్ష్ణవైరాగ్యముచే పోగొట్టవలెను.

## సూక్ష్మరూపమున దాగియున్న దంభమును పోగొట్టుటకు అనుసరించవలసిన పద్ధతులు.

తనకు ఈత చేతకానివాడు ఇతరులను దాటించుటకు వెళ్ళినచో తాను మునుగును. వారిని ముంచును. అటులనే గుప్తదంభము కల వాడు లోకముకొరకు తాను అట్లు చేయవలెననుకొని లోకము కొరకు భజనాదులు చేసినచో అంతకంతకు అతని దంభము పెరిగి అతడు ధర్మభ్రష్టుడగును. కాని ఈత వచ్చినవాడు తాను దాటును. ఇతరులను దాటించును. అట్లే దంభములేకుండ భజనచేయువాడు చివరకు పరమపదమును పొందును. ఇతరులనుకూడ పరమపదమును పొందించును. దంభహీనులగు జనుల భజనయొక్క ప్రభావము ప్రజలపై ఎక్కువగా కానవగును. మానావమానములు, నిందాస్తుతులు సమానముగా తలచనంతవరకు మనుష్యుడు తన గొప్పతనమును ప్రక టించరాదు.

ప్రజలకు సన్మార్గమును ఉపదేశించుట కళ్యాణకరము. అం దును కూడ దంభము ఉండుట సంభవము. దంభము ఉత్పన్న వ సంతనే ఉపదేశమును త్యజించవలెను. 'బహర్ హాఫ్' అను మహాపురు షుడు తన పుస్తకములపెట్టెను భూమిలో పాతిపెట్టెను. ఎవరైన అట్లు చేయుటకు కారణమడయగోరిన "నాహృదయమున ఉపదేశించవలె

నని కోరిక కలిగినది, కావున నేను ఉపదేశించుట త్యజించితిని." అని జవాబు చెప్పెడివాడు. 'ఇబ్రహీము' అను మహాపురుషుడు చెప్పెను. "నీహృదయమునందు మాట్లాడవలెనని కోరిక కలిగిన మౌనముగా నుండుము. మౌనముగా నుండవలెనని కోరిక కలిగిన మాట్లాడుము." ఉపదేశము చేయువాని హృదయమున దంభము కలిగినంతనే ఉపదేశించుట త్యజించవలెను.

'అబుహానీపా' అను మహాపురుషుడు చెప్పెను:—

"ఏరాజయిన నీకు ప్రధానమంత్రిపదవి ఇచ్చెదననిన అంగీకరించకు. జీవించి ఉన్నంతకాలము ప్రజలకు ధర్మోపదేశము చేయుము. ప్రజలు మాయాముక్తులై భగవన్మార్గమును స్వీకరించుటకు ధర్మోపదేశము చేయువాడు శుద్ధహృదయుడు. తన సభలోనికి ధనవంతులు, రాజులు వచ్చినను అతడు యథార్థమును పరిత్యజించడు. అతనికి మాయికమగు ఐశ్వర్యమునందు ప్రేమ కలుగదు. ఏలనన, అతడు నిష్కామి.

ఏమాత్రము దంభము దాగికొని ఉన్నను సాధకుడు దానిని విచారించి తెలిసికొని లేకుండ జేయవలెను. శాస్త్రములయందు "దమ్భేన హీనః క్రియతే స ధర్మః" అని చెప్పబడినది. "దంభము లేకుండ చేయబడు (దానము, ధ్యానము, పూజ, ధర్మోపదేశము మొదలగు) కర్మలు నిజమగు ధర్మము.

డా. వీరజీభాయి:—శాస్త్రములను బట్టి ఇది ధర్మము, ఇది అధర్మము అనునది నాకు కొద్దో గొప్పో తెలిసినది. కాని దాంభికులకు దంభము ఏల తెలియదు?

## ధర్మము ఎనిమిది రకములు.

## దంభమునకు ఉపయోగించునవియు, ఉపయోగించనివియు:

సాం. ప్ర:— మహాభారతమున ఉన్నది :-

ఇజ్యాధ్యయనదాని తపః సత్యం ధృతిః క్షమా,
అలోభ ఇతి మార్గోఽయం ధర్మస్యాష్టవిధః స్మృతః॥
తత్ర పూర్వశ్చతుర్వర్గో దమ్భార్థమపి సేవ్యతే,
ఉత్తరస్తు చతుర్వర్గో మహాత్మన్యేవ తిష్ఠతి॥

యజ్ఞము, అధ్యయనము, (వేదాదులు చదువుట) దానము, తపము, సత్యము, ధృతి, క్షమ, లోభాభావము అని ధర్మము ఎనిమిది రకములు. అందులో మొదటి నాలుగు అనగా, యజ్ఞము, అధ్యయనము, దానము, తపము ఇవి దంభముతో జనులు ఆచరించుటకు వీలుపడును. కాని, సత్యము, ధృతి, క్షమ, లోభాభావము ఈనాలుగును మహాత్మునియందే కానవగును. యజ్ఞాదులు నాలుగు దంభముతో కూడ చేయవచ్చును. కావున మనుష్యుడు వానిని సత్యమగు అంతఃకరణముతో చేయుచున్నాడో, లేక ప్రపంచమునకు చూపుటకు చేయుచున్నాడో తెలియదు. కాని సత్యాదుల నాల్గింటియందును దంభము వీలుపడదు. ఇది ప్రత్యక్షముగా కానవగును. కావున బుద్ధిమంతునకు దాంభికుడో, మహాత్ముడో తెలియును.

*1.* ఇజ్యా :—అనగా యజ్ఞము. కొందరు రాజులు ధనవంతులు తమను ధర్మపరాయణునిగా రుజువు చేసికొనుటకు యజ్ఞము చేయును. కాని కొందరు బ్రాహ్మణులు మొదలగువారు లోకకళ్యాణార్థము అనువంకచే యజ్ఞములు చేయుదురు.

*2.* అధ్యయనమ్:—కొందరు ప్రతిష్ఠ, ధనము మొదలగు వానికొరకు వేదాధ్యయనము చేయుదురు. కాని జనులకు వేదాధ్యయనమును ధర్మము తెలిసికొనుటకు చేయుచున్నామని చెప్పుదురు. అంతియే కాదు. విద్వాంసులు ధర్మము, భక్తి ఉపదేశించుచున్నామను నెపముతో స్వార్థమును సాధించెదరు. స్వార్థపరాయణులగుటచే శాస్త్రములయందు చెప్పబడిన యథార్థవిషయములను దాచి కపటముతో జనులను మారుత్రోవ ద్రొక్కించెదరు.

3. దానమ్ :—దానము చేయువాడు తాను దానవీరుడనని తెలుపుకొనుటకు జనుల ఎదుట బీదలకు ఏదయిన ఇచ్చును. కాని ఎవ డైన ఆకలి గలవాడు ఇంటికి వచ్చినచో అతనికి నాల్గు ధాన్యపు గింజలయినను ఇవ్వడు. బయటకు గెంటివేయును. ధార్మికకృత్యము నకు దేనికయినను 5 రూపాయిలు ఇచ్చినచో ఆవార్త పదిహేను రోజులు ముందు అచ్చువేయించును. ఈ దాంభికులగు దాతలకు దాన ఫలము లభించదు.

4. తపః :—కొందరు బ్రాహ్మణాదిగృహస్థులు చాంద్రాయ ణాదివ్రతములు, ఉపవాసములు మొదలగునవి చేయుదురు. కొందరు సాధువులు ముండ్లపై పరుండెదరు. చెట్టుకొమ్మకు తలక్రిందుగా వ్రేలా డెదరు. మౌనమును ధరించెదరు. పంచాగ్నులను జ్వలింపజేయుదురు. దుగ్ధాహారముకాని, ఫలాహారమునుకాని చేయుదురు. ఇట్టి క్రియల ద్వారా తమ ధార్మికత్వమును, తపోవృత్తిని వారు తెలుపుదురు.

ఈ నాలుగును దంభముచేకూడ చేయబడును. కాని సత్యము, ధృతిః క్షమః లోభాభావము వీటిలో దంభమునకు అవకాశము లేదు.

5. సత్యమ్ :— సత్యభాషి స్వతః కనిపించును. సత్యవ్రతుడు వేషముచే భక్తిని కనపరచడు. ధర్మోపదేశముచే శాస్త్రార్థ మును మార్చివేయడు. ప్రజల మనస్సు మార్చి తన స్వార్థమును పూర్తిచేసికొనడు.

6. ధృతిః :— అనగా పట్టుదల. పట్టుదలకలవాడు ఆప త్కాలమునందుకూడ ధర్మమర్యాదలను త్యజించడు. ఆర్థికబాధలు కలిగినను, పుత్రాదులు మరణమునొందినను దేవుని దూషించడు. తన శ్రద్ధాభక్తులను విడనాడడు.

7. క్షమా :—క్షమాశీలుడైన మానవుని తేలికగా గుర్తించ వచ్చును. సమర్థత కలిగియుండికూడ అజ్ఞానులగు మానవులు చేసిన

అపకారములకు వారిని దండించడు. వారిని దండించవలెనను కోరిక కూడ కలిగియుండడు.

౮. అలోభః:— లభించిన ద్రవ్యాదులను రక్షించుట, తాను కాని ఇతరులు కాని వానిని ఉపయోగించుటకు వీలుండనీయక పోవుట వానిని రోజురోజుకు పెంచవలెనని తలచుట లోభము. ఇట్లు తలచక ఔదార్యముతో తనద్రవ్యమును దానము, ధర్మము మొదలగు సత్ప్రవృత్తులయందు ఉపయోగించుట లోభాభావముయొక్క లక్షణము.

ఈదంభము ఇతరులయందు కలదేమో చూడవలసిన అవసరము తనకు లేదు. ఆ అధికారముకూడ లేదు. కాని తనయందు ఉన్నదా, లేదా అని మాత్రము ఎప్పుడును పరీక్షించుచుండవలెను.

## చిత్తైకాగ్రతకు స్థూలమనోవృత్తులను క్రియాయోగముచే సూక్ష్మము చేయవలెను.

డా. పీ.:—చిత్తైకాగ్రతకు ప్రయత్నించుచున్నాను. కాని ఏకాగ్రత కుదురుటలేదు. అది ఎట్లు కుదురును?

స్వా. ని.:—సాంసారికజీవుల చిత్తము స్వభావముచే స్థూలముగా నుండును. వస్త్రాదికములయందు ఎక్కువ మురికి పట్టినట్లుగనే వారి చిత్తమున విషయవాసన, మమత్వము మొదలగునవి ఎక్కువగా నుండుటచే ఇష్టవస్తువియోగము, అనిష్టవస్తుసంయోగము మొదలగు అనేకరకములగు సాంసారిక ఉపాధులకొరకు వారి మనస్సునందు ఎక్కువ మాలిన్యము చేరును. చిత్తము ఎక్కువ చంచల మగును. అది చిత్తముయొక్క స్థూలత్వము అని చెప్పబడును.

అనాత్మన్యాత్మభావేన దేహభావనయా తథా ।
పుత్రదారైః కుటుంబైశ్చ చేతో గచ్ఛతి పీనతామ్ ॥
అహంకారవికారేణ మమతామలలీలయా ।
ఇదం మమేతి భావేన చేతో గచ్ఛతి పీనతామ్ ॥ (యో. వా.)

"అనాత్మపదార్థములయందు ఆత్మబుద్ధి కలిగియుండుట, దేహమునందు ఆత్మబుద్ధి కలిగియుండుట, పుత్రులు, భార్య, కుటుంబము మొదలగువారియందు మోహమమత్వములు కలిగియుండుట– వీనిచే చిత్తము స్థూలత్వమును చెందును."

ఈస్థూలచిత్తము కలవాడు మొదట క్రియాయోగముచే చిత్తమును సూక్ష్మము కావించవలెను.

*"తపః స్వాధ్యాయేశ్వరప్రణిధానాని క్రియాయోగః"* (యోగసూత్రములు.) తపస్సు, స్వాధ్యాయము, ఈశ్వరప్రణిధానము– ఈ మూడును క్రియాయోగము అనబడును. వేదసంహిత, రుద్రము మొదలగునవి అధ్యయనము చేయుట ప్రణవాదిమంత్రములను జపముచేయుట, ఈశ్వరుడు ప్రసన్నుడగుటకు ఫలేచ్ఛను విడనాడి వర్ణాశ్రమధర్మములను అనుష్ఠించుట– ఇది క్రియాయోగము. ఈ క్రియాయోగమును ఎక్కువకాలము ఎల్లప్పుడు శ్రద్ధాభక్తులతో చేసినచో చిత్తవృత్తి స్థూలత్వమును త్యజించి సూక్ష్మముగా నగును. అనగా ఏకాగ్రతను చెందును.

తగిన క్రియాయోగముచే చిత్తము ఏకాగ్రతను పొందును.

*ఏకాగ్రశ్చేత్ గ్రాహ్యాదౌ, నిరోధశ్చేత్ చిదాత్మని,*
*క్షిప్తాదిత్రితయవస్త్యాగాత్ కస్య మోక్షోఽత్ర దూరతః॥*

"ధ్యేయాదులయందు ఏకాగ్రతయుండి, చిదాత్మయందు నిరోధముకలిగి, క్షిప్తాది మూడు అవస్థలను త్యజించినచో మోక్షము ఎంతో దూరమున ఉండదు."

క్షిప్తము:— రజోగుణప్రాధాన్యముచే శబ్దాది పంచవిషయములయందు అనురాగము కలిగియుండుట లోకవాసన, దేహవాసన, శాస్త్రవాసన– ఈమూడింటియందుమ ప్రవృత్తికల మనస్సు క్షిప్తము అనబడును

మూఢత్వము:— తమోగుణప్రాధాన్యముచే కృత్యాకృత్య విచారము చేయక అధర్మమునందు అనురాగముకలిగి నిద్ర, తంద్రి మొదలగు దోషములకు లోబడు మనస్సు మూఢత్వముకల మనస్సు అని చెప్పబడును.

విక్షిప్తము:— సత్త్వగుణప్రాధాన్యముచే దుఃఖసాధనములను పరిహరించుట, సుఖసాధనములను పొందుట అను వానియందు ప్రవృత్తి కలిగియుండు మనస్సు విక్షిప్తము,

ఏకాగ్రము:— ధ్యేయాతిరిక్తములగు వృత్తులను నిరోధించునదియు, ఆత్మప్రకాశమును కలిగించు నిరోధావస్థనుకలిగించు సంప్రజ్ఞాతసమాధి ఏకాగ్రత యనబడును.

నిరుద్ధము:— అన్ని వృత్తులను నిరోధించుటచే కలిగిన అసంప్రజ్ఞాతసమాధి.

## విషయేచ్ఛ త్యజించనిదే బ్రహ్మసుఖము లేదు.

డా. పీ.:— విషయసుఖమును అనుభవించుచు బ్రహ్మసుఖమును అనుభవించు అవకాశము కలదా?

స్వా. ప్ర.— తనముక్కులో మాలిన్యమునుంచుకొని ఎదుట అత్తర్లు, సెంట్లు, పూలు మొదలగు సుగంధద్రవ్యములు ఉంచుకొనిన వానిసుగంధమును అనుభవించగలడా? మనుజుడు విషయాదులయందు ఆసక్తి కలిగి అల్పసుఖమును అనుభవించునపుడు మహత్తరమగు బ్రహ్మసుఖమును అతడు అనుభవించలేడు.

భగవానుడు ఇట్లు చెప్పెను:—

## బాహ్యస్పర్శను త్యజించుటచే అక్షయసుఖము కలుగును.

*బాహ్యస్పర్శేష్వసక్తాత్మా విన్దత్యాత్మని యత్సుఖమ్।*
*స బ్రహ్మయోగయుక్తాత్మా సుఖమక్షయ్యమశ్నుతే॥*

"బాహ్యవిషయములను అనుభవించుటయందు ఎవరి మనస్సు ఆసక్తిని పొందదో ఆవ్యక్తి ఆత్మయందే ఆనందమును పొందును. బ్రహ్మసాక్షాత్కారము పొందిన ఆమనుజుడు అక్షయసుఖమును పొందును."

ఇంద్రియస్పర్శగల విషయములు శబ్దాదులు. అవి అనాత్మ రూపములు అగుటవలన బహిష్కరించదగినవి. శబ్దాదికములయందు ఆసక్తిలేనివాని అంతఃకరణమునందు చిత్తచాంచల్యము లేనందునను, శాంతి స్థాపించబడినందునను సుఖానుభవము కలుగును. ఇట్లు తృష్ణారహితుడయినందున ఆజనుడు సమాధియందు పరమాత్మస్వరూపముతో తన అంతఃకరణమును ఏకీకృతమొనర్చుటకు సమర్థుడగును. ఆసమాధియొక్క అభ్యాసము పరిపక్వమయిన నిర్వికల్ప సిద్ధికి చేరును. అంతట వినాశమునొందని గొప్పదగు ఆత్మసుఖమును పొందును. అనగా విషయపదార్థములనుండి ఆసక్తిపోనిదే చిత్తైకాగ్రత కలుగదు. శాంతిసుఖము కలుగదు. ఇక నిర్వికల్ప సమాధిమాట చెప్పనేమి!

## అజ్ఞానముచే దుఃఖపూరితములగు విషయపదార్థములందు సుఖము భాసించును.

విషయపదార్థములయందు ఏవిధమగు సుఖమును లేదు. అందు సుఖము కలుగుననునది భ్రాంతి. కుక్క ఎండిన గట్టి ఎముక ముక్కను కొరుకును. ఆతరుణమున దానినోటినుండి ఒకప్పుడు ఆఘాతమువలన రక్తము స్రవించును. కాని కుక్క ఆరక్తము ఎముకనుండి స్రవించును అనుకొని మరింత కొరుకును. ఇటులనే విషయానుభవ సమయమున అంతఃకరణముయొక్క వృత్తి స్థిరమగుటచే అందు ఆత్మస్వరూపమగు ఆనందముయొక్క ప్రతిబింబము పడును. అంతట ఆనందానుభవము అగును. దీనిని అజ్ఞాని భ్రాంతిచే విషయానంద మనుకొనును. ఇట్లు ఆనందప్రతీతి జరిగిన ప్రతిచోటను వృత్తిస్థిరత్వ

ముచే వృత్తియందు ఆత్మస్వరూపముయొక్క ప్రతిబింబము పడిన దున ఆనందప్రతీతి కలుగును.

విషయములయందు ఆనందమే ఉన్నచో ఒకదాని అభా మున మరియొక విషయమునందు కోరిక కలుగరాదు. స్థిరవృ యందు ప్రతిబింబరూపమగు ఆనందమును అంగీకరించినచో ఒక వి యమును అనుభవించిన తరువాత మరియొక విషయమునందు ఇచ్ఛ కలుగుటకు కారణము వృత్తి స్థైర్యము కోలుపోవుటయే అని తే తెల్లమగును. ఈచాంచల్యము కల వృత్తి ఆత్మస్వరూపముయొక ప్రతిబింబమును గ్రహించు సామర్థ్యమును కలిగియుండనందున ఆన దము కలుగదు.

అంతియే కాదు. విషయములందు ఆనందము ఉన్నచో సుషుప్తియందు ఏవిషయమును ఉండనందున ఆనందము కలుగరాదు కాని సుషుప్తియందు కలుగు ఆనందము ఎల్లరకును అనుభవమే కావున విషయములయందు కలుగు ఆనందము విషయములచే లభి చినది కాదనియు, స్థిరవృత్తియందు లభించిన ఆత్మ స్వరూప ఆనం ప్రతిబింబమునూత్రమే ననియు, అది భ్రాంతిచే అట్లు తోచుచున్న దనియు స్పష్టము. ఈ ఆనందము ఆత్మసుఖము అను గంగా ప్రవ హము ఎదుట ఒక చిన్నబిందువువలెకూడ గణనీయమయినది కాదు

## బ్రహ్మసుఖముముందు మిగిలిన సుఖములు అన్నియు వ్యర్థములు.

నిరుపాధిక బ్రహ్మసుఖమే నిజమైన సుఖము. శ్రుతిలో ఇట్లు చెప్పబడినది:—

యో వై భూమా తత్సుఖం నాల్పే సుఖమస్తి భూమైవ సుఖం
భూమా త్వేవ విజిజ్ఞాసితవ్య ఇతి॥ (ఛాన్దోగ్యోపనిషత్)

మహాత్స్వరూపమగు బ్రహ్మమే సుఖము. తుచ్ఛములగు విషయపదార్థములయందు సుఖము లేదు. మహత్తమమగు బ్రహ్మతత్త్వమే సుఖము. కావున ఆబ్రహ్మతత్త్వమును తెలిసికొనుటకే ప్రయత్నించవలెను. ఆబ్రహ్మసుఖమును గురించి తైత్తిరీయ సంహితయందు చెప్పబడినది.

మానవుడు రూపవంతుడు, యువకుడు, శాస్త్రజ్ఞుడు, పట్టుదలకలవాడు, బలవంతుడు అయి ధనసహితమగు ఈభూమి అంతయు ఆతని అధీనములో ఉన్నచో అతనికి ఆనందము కలుగును. ఇటువంటి నూరుగురు మనుష్యుల ఆనందము ఒక మానవగంధర్వుని ఆనందమునకు సరిపోవును.

ఆ మానవగంధర్వానందము శ్రోత్రియుడును, నిష్కామియును అగు మానవునకు కలుగును. అట్టి నూరుగురు మానవగంధర్వులకు కలుగు ఆనందము ఒక దేవగంధర్వునకు కలుగును. అట్టి వందమంది దేవగంధర్వులకు కలుగు ఆనందము చిరకాలము స్థిరముగా పితృలోకమున ఉండు ఒక పితృదేవతకు కలుగును. అట్టి ఆనందము శ్రోత్రియుడును, నిష్కామియును అగు జనునకు కలుగును. అట్టి వందమంది పితృదేవతలకు కలుగు ఆనందము జన్మాది రహితులగు దేవతలలో ఒకనికి కలుగు ఆనందమునకు సమానము. అట్టి వందమందికి కలుగు ఆనందము కర్మానుష్ఠానముచే కలుగు ఒక దివ్యానందమునకు సమానము. ఆ కర్మానందమునకు వందరెట్లు ముఖ్యమగు దివ్యానందము. అది శ్రోత్రియుడును, నిష్కామియును అగు నరునకు కలుగును. ఆదివ్యానందమునకు వందరెట్లు ఒక ఇంద్రానందము. అది నిష్కామియును, శ్రోత్రియుడును అగు నరునకు కలుగును. దానికి నూరురెట్లు బృహస్పతికి కలుగు ఆనందము. అది శ్రోత్రియుడును నిష్కామియును అగు నరునకు కలుగును. బృహస్పతికి కలుగు ఆనం

మునకు నూరురెట్లు ప్రజాపతికి కలుగు ఒక ఆనందము. అది శ్రోత్రి యునకు, నిష్కామియును అగు నూనవునకు కలుగును. ప్రాజా పత్యానందమునకు నూరురెట్లు బ్రహ్మానందము. అదియే పరమానం దము యొక్క అనగా బ్రహ్మసుఖముయొక్క అంశము.

బ్రహ్మానందమునకు సాటియైనది మరియేమి కలదు? అది నిరతి శయ సౌఖ్యము. కఠోపనిషత్తునందు ఇట్లున్నది :—

*ఏకో సర్వభూతాన్తరాత్మా, ఏకం రూపం బహుధా యః కరోతి ।*
*తమాత్మస్థం యేఽనుపశ్యన్తి ధీరాస్తేషాం సుఖం శాశ్వతం నేతరేషామ్॥*

"సర్వభూత నియామకుడును, సర్వాంతర్గతుడును, తాను ఒకే రూపమును కలిగియున్నవాడైనను, అనేక రూపములుగా కన్పట్టువా డును, అగు ఆపరమాత్మను ఏధీరుడు ఆత్మయందు చూచునో ఆతడే శాశ్వత సౌఖ్యమును పొందును. ఇతరులు పొందరు."

ఇటులనే బ్రహ్మసుఖమును అనుభవించు జ్ఞాని ఇతరసుఖములను కోరడు. విషమిశ్రితమగు మృష్టాన్నము భోజనసమయమున ఎంత యో సుఖముగ నున్నను పరిణామమున దుఃఖదాయక మగునట్లుగనే ప్రాపంచికసుఖములు గీత 5వ అధ్యాయమున చెప్పినట్లు విషయేం ద్రియసంయోగమున జనించినందున పరిణామమున దుఃఖకరములే.

*"యే హి సంస్పర్శజా భోగా దుఃఖయోనయ ఏవ తే ।*
*ఆద్యన్తవన్తః కౌన్తేయ న తేషు రమతే బుధః ॥"*

"విషయానుభవము ఇంద్రియసంయోగముచే జరుగును. అది దుఃఖకారణము. విషయేంద్రియవియోగముచే భోగములకు నాశము కలుగును కదా! అవి క్షణికములు. కావున విద్వాంసుడు వానియందు సంతోషమును పొందడు."

*"పరిణామతాపసంస్కారదుఃఖైర్గుణవృత్తివిరోధాచ్చ దుఃఖమేవ సర్వం వివేకినః"* (యోగసూత్రములు)

"విషయములయందు పరిణామదుఃఖము, తాపదుఃఖము, సంస్కారదుఃఖము అను మూడురకముల దుఃఖములు ఉన్నవి. అంతియే కాదు. సత్త్వాదిగుణములకును, వృత్తులకును పరస్పరవిరోధము కలదు. కావున విషయపదార్థస్వరూపముచేతనే దుఃఖము కలుగును. కావున వివేకముకల నరునకు సమస్తము, అనగా ఈలోకము, పరలోకము రెంటియందును విషయపదార్థములు దుఃఖదాయకములే."

విషయసుఖము రాగపరిణామము. ఎవనికైన మృష్టాన్నము తినవలెనను కోరిక కలిగినచో, అతనికి తన ఎదుట మృష్టాన్నము చూచినప్పుడు ఆనందము కలుగును. శాస్త్రమునందు అది 'ప్రియము' అని చెప్పబడినది. ఆవ్యక్తికి మృష్టాన్నము లభించినప్పుడు కలుగు ఆనందము "మోదము" అని చెప్పబడినది. ఆమృష్టాన్నమును భుజించినతరువాత అతనికి కలుగునది "ప్రమోదము." మృష్టాన్నమునందు రాగములేనివానికి ఈ మూడురకములగు సుఖములును కలుగవు. కావున విషయసుఖము రాగపరిణామము అని తెలిసికొనవచ్చును. మొదట రాగము ప్రత్యక్షమగును. నరుడు విషయప్రాప్తికి తదుపరి ప్రయత్నించును. విషయానుభవము జరిగినకొలదియు రాగము వృద్ధి చెందుచునే యుండును. మానవుని ఇచ్ఛానుసారము విషయపదార్థములు లభించవు. విషయములు లభించనపుడు కలుగు దుఃఖమును నివర్తించుటకు తగిన సామర్థ్యము ఎవనికిని లేదు. కావున విషయములు దుఃఖరూపములే. విషయభోగములు పెంచినకొలదియు రాగము వృద్ధిచెందును. ఇంద్రియానుభవమునందు చాతుర్యము పెరుగును. రాగపరిణామము విషయభోగము. రాగము దుఃఖరూపము. కావున విషయభోగముకూడ దుఃఖరూపమే. పరిణామము దుఃఖము అనగా ఇదియే.

తన సుఖానుభవకాలమున మానవుడు తన సుఖమునకు ప్రతికూలవ ు పదార్థమునందు ద్వేషమును కలిగియుండును. రాగ, ద్వేష

ములు ప్రతిపక్షులు అగుటచే ఒకదానివెంట మరియొకటి ఉండును. కొందరికి ఇతరుల్లను మనోవాక్కాయములచే హింసించనిదే సుఖము కలుగదు. అది ఇతరములగు దుఃఖసాధనములను తప్పించ లేదు. కావున ఆ సుఖానుభవకాలమున సుఖవిరోధియగు ద్వేషము కూడ తప్పక యుండును. ఈ ద్వేషమోహరూపమగు తాపమే దుఃఖము.

మానవుడు అనుభవించిన విషయసుఖము లన్నియు అతని మనస్సునందు సంస్కారమును పుట్టించి నశించును. సంస్కారముచే సుఖస్మరణము కలుగును. స్మరణముచే విషయపదార్థములయందు రాగము కలుగును. రాగముచే విషయప్రాప్తికి ధర్మాధర్మరూప మగు చేష్టలు జరుగును. చేష్టలద్వారా విషయప్రాప్తి కలిగిన అది భోగ మనబడును. తరువాతిపర్యాయము ఈ సంస్కారము బలమును పొంది ధర్మాధర్మరూపమగు అదృష్టమును జనింపజేయును. దానిచే సుఖదుఃఖములు అనెడు ఫలమును అనుభవించుటకు మరల జన్మించ వలసి వచ్చును. ఈవిధముగా ఈప్రపంచచక్రము తిరుగును. దీనినే శాస్త్రములయందు సంస్కారదుఃఖము అని చెప్పిరి.

విషయపదార్థములు స్వరూపముచేతనే ఏల దుఃఖకరములు అను సంగతి శాస్త్రములయందు వివరించబడినది. పదార్థములు త్రిగుణాత్మకములు. సత్త్వగుణము సుఖస్వరూపము. రజోగుణము దుఃఖ స్వరూపము. తమోగుణము మోహస్వరూపము. ఈమూడును ఒక దానికి మరొకటి విరుద్ధమగు స్వభావము కలవి. దీపము వెలుగుటకు వత్తి, నూనె, అగ్ని మూడును అవసరము. ఈమూడును ఒకదానికి ఒకటి వ్యతిరేకమగు స్వభావముకలవియే. అయినను ఈమూడును కలసిననే జ్వాల కలుగును. ఈమూడింటియందును ఏ ఒకటి లేకపోయి నను దీపము వెలుగదు. ఏ ఒకటి అవసరమైనదానికంటె కుూవగా నున్నను దీపము వెలుగుటకు ఆటంకము కలుగును. ఈవిధముగనే

ప్రపంచమునందు సత్త్వ, రజ, స్తమోగుణములు కూడను. కావున ఏ విషయపదార్థమయినను తన సత్త్వగుణాంశముచే సుఖము కలిగించినచోఁ, అక్కడ రజోగుణాంశమగు దుఃఖము, తమోగుణాంశమగు మోహము పైకి కనపడకుండ ఉన్నవనియే గ్రహించవలెను. అవి ఎప్పుడు పైకి ఉబుకునో తెలియదు. దీనిచే విషయపదార్థములు స్వభావముచే దుఃఖరూపములు అను సంగతి విశదము.

ఇటులనే పరిణామదుఃఖము, తాపదుఃఖము, సంస్కారదుఃఖము, స్వరూపదుఃఖము— ఈనాలుగురకముల దుఃఖములు ప్రతివిషయపదార్థమునందును ఉండును. కావున విషయములను అనుభవించినంత కాలము, వానిని త్యజించనంతవరకు, అతని ఎదుట దుఃఖములు సిద్ధముగా నుండును. ఈవిషయము విష్ణుపురాణమున ఉన్నది:—

*యావతః కురుతే జన్తుః సంబన్ధాన్మనసః ప్రియాన్ ।*
*తావన్తోఽస్య నిఖన్యన్తే హృదయే శోకశఙ్కవః ॥*

“జనుడు తన మనస్సునకు భోగ్యపదార్థములతోఁ సంబంధములెన్నిటిని పెట్టుకొనునో అన్ని శోకములనెడు మేకులు అతని హృదయమున నాటబడును.

ఆకారణముచేతనే అష్టవిధములగు భోగములయందును మానవుడు (విద్వాంసుడగు మానవుడు) అనురాగము కలిగియుండడు.

## జ్ఞానుల ప్రారబ్ధభోగమునందును, సంసారుల విషయభోగమునందును కల తాత్త్వికభేదము.

డా. వీ.:— రోగము ఉన్నంతవరకు పథ్యము చేయవలెను. తరువాత అవసరము లేదు. అటులనే ముముక్షువు విషయపదార్థముల పరిత్యాగము చేయవలెను. కాని జ్ఞాని ప్రారబ్ధవశమున విషయపదార్థములను అనుభవించినచోఁ ఏమైన హాని కలదా?

స్వా. ప్ర.:— వైభవము, భోగములు కావలెనను కోరిక రజోగుణజనితము. జ్ఞాని అంతఃకరణమున, రజోగుణలేశముకూడ ఉండుటకు అవకాశము లేదు.

"రజో రాగాత్మకం విద్ధి" అని గీతయందు చెప్పబడినది.

విషయాదులయందు ఇచ్ఛ రజోగుణమునుండి కలుగును. రజోగుణమును త్యజించి సాధకుడు మిశ్రసత్త్వగుణమును (దైవసంపత్తిని) పొందును. అనంతరము ఆతనికి శుద్ధసత్త్వగుణముచే ఆత్మజ్ఞానము కలుగును. మిశ్రసత్త్వగుణము పోయి, శుద్ధసత్త్వగుణముచే ఆత్మజ్ఞానోపలబ్ధి కలిగిన యనంతరము విషయేచ్ఛలు ఎట్లు కలుగును? జ్ఞానికి విషయేచ్ఛలు ఏవిధముగను కలుగవు.

రోగి రోగశాంతికొరకు ఔషధసేవ చేయునపుడు పథ్యముగా నుండవలెను. రోగము తగ్గినతరువాత అక్కరలేదు. అని నీవు చెప్పినది బాగుగనే ఉన్నది. కాని రోగి మృష్టాన్నమును దోషదృష్టితో త్యజించడు. కాని జ్ఞాని విషయపదార్థములయందు దోషములను గమనించి వానిని అనుభవించుటకు కాని, సంగ్రహించుటకు కాని ఆశించడు. కావున రోగియు, జ్ఞానియు సమానులనుట తగదు.

*విషయా వినివర్తన్తే నిరాహారస్య దేహినః।*
*రసవర్జం రసోఽప్యస్య పరం దృష్ట్వా నివర్తతే॥* (గీతావాక్యము)

విషయపదార్థములను అనుభవించని రోగులు మొదలగువారు వానికి దూరముగా నుందురు. కాని వానియందు రసము (పదార్థములయందు ప్రేమ) నిలవయుండును. కాని పరమాత్మస్వరూపదర్శనముచే అనగా ఆనందస్వరూపసాక్షాత్కారముచే విషయపదార్థములయందలి ప్రీతికూడ నివృత్తిని పొందును.

రోగికి విషయములయందు అనురాగము నశించదు. రోగకారణమున విషయేచ్ఛలు అణచబడియుండును. రోగము తగ్గినంతనే

అణచబడిన విషయేచ్ఛలు మరల తల ఎత్తును. అంతట అతడు విషయములను అనుభవించును.

కాని జ్ఞానివిషయము అట్లుకాదు. జిజ్ఞాసు అవస్థయందే విషయములయందు దోషదృష్టిని కలిగియుండుటచే ముముక్షు అవస్థయందు అతనికి విషయేచ్ఛ కలుగదు. ఇంక జ్ఞానావస్థయందు పరమాత్మదర్శనమను మహాసుఖమును పొందినతరువాత స్వాభావికముగనే విషయపదార్థములయొక్క తుచ్ఛసుఖములలో అతనికి ప్రేమ కలుగదు.

ఈవిషయమున యముడు నచికేతునకు చెప్పెను:-

"పరాచః కామాననుయన్తి బాలాస్తే మృత్యోర్యన్తి వితతస్య పాశమ్,
అథ ధీరా అమృతత్వం విదిత్వా ధ్రువమధ్రువేష్విహ న ప్రార్థయన్తే॥

"అల్పబుద్ధికలవాడు బాహ్యములగు విషయములచే ఆకర్షించబడును. ఆకారణముచే అతడు అందరను వశపరచుకొను మృత్యుపాశముచే బద్ధుడగును. కాని జ్ఞాని అమృతరూపుడును (ప్రత్యగాత్మస్వరూపుడును) అగు నిత్యబ్రహ్మస్వరూపమును తెలిసికొని అనిత్యపదార్థములయందు కోరికను కలిగియుండడు."

## స్వామివారి వినోదము.

ఇంతలో అందరును భోజనమునకు వెళ్లిరి. తరువాత శ్రీప్రకాశానందస్వామివారిని తీసికొనివెళ్ళుటకు జేతపురమునుండి డా॥ లల్లుభా కాడాభాయి మున్నగువారు వచ్చిరి. డా॥ వీరజీభాయి శ్రీ త్యాగానందస్వామివారి అనుమతి తీసికొని జామ్‌నగరుకును, శ్రీప్రకాశానందస్వామివారు జేతపురమునకును బయలుదేరిరి. వీరజీభాయి ప్రకాశానందస్వామివారి చినిగిన బొంతనుండి ఒక గుడ్డపీలికను లాగెను. ఇది చూచి ప్రక్కనున్నవారు అడిగిరి "అది ఏమి?"

డా. వీ. :—ఇది శ్రీస్వామివారి ప్రసాదము. వారిగి జ్ఞప్తికి తెచ్చుకొనుటకు దీనిని పూజించెదను.

స్వా. ప్రి. :—ఒక గ్రామమున ఒక గురువు ఉండెను. అతడు జిల్లా అంతకు ప్రసిద్ధి చెందిన గురువు. ధర్మోపదేశమునకు చుట్టు ప్రక్కల గ్రామములలోనికి వెళ్ళెడివాడు. ఒకమారు అతడు సంచారము చేయుచు ఇంకొకరు సామాన్యగురువుగానున్న గ్రామమునకు వెళ్లెను జనులు అతనిని ఉపన్యసించమని కోరిరి. అతని ఉపన్యాసమును వినుటకు నాలుగైదువేలమంది ప్రజలు వచ్చిరి. ఇది చూచి ఆ సామాన్యగురువునకు ఈర్ష్య కలిగెను. నిండుసభలో ఇతనికి మానభంగము చేసినచో శని వదలును అనుకొనెను.

అతడు ఇట్లనెను. "గురూ, పురానునందలి ఫలానావాక్యమునకు అర్థమేమి?"

ఉపన్యసించు వ్యక్తి, ఇతనిని ఈర్ష్య అను భూతము ఆవహించినదని తెలిసికొనెను. అతడు వెంటనే ఆసనమునుండి క్రిందికి దిగెను. ఆ సామాన్యగురువునకు నమస్కరించి ఆసనముపై కూర్చుండబెట్టి తాను క్రింద కూర్చొనెను. ఆసనముపై కూర్చొనిన సామాన్యగురువు ఏదో వాగసాగెను. అతని ఉపన్యాసము పూర్తి అయినంతనే గురువు సామాన్యగురువుయొక్క గడ్డమునుండి ఒక వెంట్రుక ఊడబెరికి కండ్లకద్దుకొనెను. "ఇదేమి చేయుచున్నారు?" అని ప్రక్కవారడిగిరి. "ఈ గురువు గొప్ప మహాత్ముడు. ఇతని వెంట్రుక బంగారపుతావేజుయందు ఉంచి ధూపదీపముల నిచ్చినచో దేవుడు దయజూపును." అని అతడు సమాధానము చెప్పెను. ఇది తెలిసికొని సభలోనికి వచ్చిన ఐదువేలమందియును ఆయన గడ్డమునుండి ఒక్కొక్క వెంట్రుకను ఊడబెరికిరి. అంతట సామాన్యగురువుయొక్క మీసము, గడ్డము పోయెను. ముఖ

ఈవిధముగా నా బొంతనుండి ఒక్కొక్కపీలిక ఇక్కడున్నవారు నీవలె లాగికొన్న నాకు బొంత ఉండదు.

ఇది విని శ్రీనిత్యానందస్వామి మున్నగువారు నవ్విరి. డా॥ వీరజీభాయి జామ్నగరుకు వెడలెను.

—♦—